
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 28 జనవరి 2025





పరిష్కార వారధిగా.. నేడే చర్చావేదిక

- కడప అశోక్ నగర్‌లో..
- ప్రొద్దుటూరు హనుమాన్ నగర్‌లో నిర్వహణ
- కడపలో మేయర్ సురేశ్‌బాబు, కమిషనర్ మనోజ్‌రెడ్డి..
- ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, చైర్‌పర్సన్ లక్ష్మిదేవి, కమిషనర్ మల్లికార్జున హాజరు

(కడప-ఆంధ్రజ్యోతి): జనానికి అక్షరాయుధం ఆంధ్రజ్యోతి. ఏ సమస్య అయినా సరే చెప్పు కుంటే.. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లోనుకాకుండా ఆంధ్రజ్యోతి డేరింగ్, డ్యాషింగ్‌గా వార్తలు ప్రచురిస్తూ వస్తోంది. ఇప్పటిదాకా ప్రజా సమస్యలను వెలికితీయడం, అవినీతిపై వార్తలు ప్రచురించడంతో పాటు రాజకీయాల్లో లొసుగులను ప్రజలకు తెలియజేస్తూ వచ్చింది. 22 సంవత్సరాలుగా ప్రజల పక్షాన ఆంధ్రజ్యోతి అలుపెరగని పోరాటం చేస్తోంది. 23వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఆంధ్రజ్యోతి దినపత్రిక.. తమను ఆదరిస్తున్న జనం కోసం నడుం బిగించింది. జనాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. అందులో భాగంగా 'అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా' కార్యక్రమానికి రూపకల్పన చేసింది. కడపలోని అశోక్‌నగర్‌లో, ప్రొద్దుటూరులోని హనుమాన్‌నగర్‌లో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. వీధుల్లో చెత్త ఎత్తకున్నా.. మురుగు కాలువలు శుభ్రం చేయక పోయినా.. వీధి లైట్లు వెలగకపోయినా.. రోడ్లు సరిగా లేకున్నా.. ఇలాంటి సమస్యలను ప్రజలు నివేదించవచ్చు. ఆంధ్రజ్యోతి నిర్వహించే ఈ చర్చావేదిక కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సమస్యలు ఆలకించి పరిష్కరించేందుకు కృషి చేయనున్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజల పక్షాన ఆంధ్రజ్యోతి నిలబడుతుంది.



కడపలో..

మంగళవారం ఉదయం 8.30 గంటలకు కడప నగరంలోని అశోక్‌నగర్‌లో సచివాలయం-2 వద్ద 'అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా' ఆంధ్రజ్యోతి చర్చావేదిక నిర్వహించనుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప మేయర్ సురేశ్ బాబు, కడప కమిషనర్ మనోజ్‌రెడ్డి, 5వ డివిజన్ కార్పొరేటర్ బండి జయమ్మ హాజరుకానున్నారు.

ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరులోని హనుమాన్‌నగర్‌లో అంజనేయస్వామి దేవాలయం వద్ద మంగళవారం ఉదయం 10.30 గంటలకు 'అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా' ఆంధ్రజ్యోతి చర్చావేదిక నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎస్.వరదరాజులరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, కౌన్సిలర్ అనిల్ తదితరులు హాజరు కానున్నారు.



కడపలో ఇక రోజూ నీటి సరఫరా

- చెత్త, డ్రైనేజీ తీయకపోతే ఫిర్యాదు చేయవచ్చు
- ప్రాధాన్యతపరంగా పనులు పూర్తి చేస్తాం
- కార్పొరేషన్ కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి



(కడప-ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో రోజూ తాగునీరందించే ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి తెలిపారు. కార్పొరేషన్‌లో పనులకోసం ఎవ్వరి సిఫారసు లేఖలూ అవసరం లేదన్నారు. ఏ పని ఉన్నా నేరుగా తనను కలవచ్చని చెప్పారు. ఆంధ్రజ్యోతి వేసిన పలు ప్రశ్నలకు పటాపట్ సమాధానాలు చెప్పారు.

ప్రశ్న: కడపలో నిరంతర తాగునీరు ఎప్పటికి అందిస్తారు

జవాబు: కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు కడపలో ఇక నుంచి రోజూ నీళ్లివ్వాలని నిర్ణయించుకున్నాం. ప్రస్తుతం ఉన్న నీటి వనరుల ద్వారానే తాగునీరందిస్తాం. ఇప్పటికే అధికారులతో సమావేశం నిర్వహించాం. తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని డివిజన్లలో రోజూ నీరిచ్చేలా ఏర్పాట్లు చేశాం. అది సక్సెస్ అయితే అన్ని డివిజన్లలో నీటిలభ్యత ఆధారంగా తాగునీరందిస్తాం. వేసవిలో కూడా తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు రూపొందించాం. అప్పటి పరిస్థితులు భయంకరంగా ఉంటే రోజుమార్చి రోజు నీళ్లు ఇస్తాం. జనం కూడా నీళ్లను వృధా చేయకూడదు. అవసరం బట్టి వాడుకోవాలి.

ప్రశ్న: కొన్నిచోట్ల పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది

జవాబు: కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదు. నేను ప్రతిరోజూ విజిట్ చేస్తున్నాను. చెత్తసేకరణ బండ్లు ఆ ప్రాంతానికి రాకున్నా ఇతరత్రా పారిశుధ్యం గురించి నేను విజిట్‌కు వచ్చినప్పుడు నాకు ఫిర్యాదు చేయండి. ఇక ప్రతిరోజూ మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో డ్రైనేజీలు క్లీన్ చేస్తారు. ఎక్కడైనా సరే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టకుంటే నేను విజిట్‌కు వచ్చినప్పుడు ఫిర్యాదు చేయవచ్చు. ఇక ప్రతి పదిరోజులకు ఒకసారి దోమల నివారణ కోసం రీజియన్‌లో ఫాగింగ్ చేస్తాం.

ప్రశ్న: కార్పొరేషన్‌లో ప్రతి సేవకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే రాజకీయ నాయకుల సిపారసు ఉంటేనే పనిచేస్తామని సిబ్బంది చెబుతున్నారు.

జవాబు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎవరి సిఫారసులు అవసరం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. గృహ నిర్మాణం నుంచి ప్రతి సమస్యపై వచ్చే జనాలు నేరుగా నన్ను కలవచ్చు. ఎవరికీ పైసా ఇవ్వవద్దు. ఏ పనికీ రాజకీయ నాయకుల సిఫారసు అవసరం లేదు. ఏ అధికారి అయినా రాజకీయ నేతల పేర్లు చెబితే వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కడపలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది.. చర్యలేమిటి

జవాబు: కడప నగరం రాయలసీమకే హార్ట్‌లాంటిది. ఇటీవల కడపలో వాహనాల సంఖ్య పెరిగింది. ట్రాఫిక్ నియంత్రణ కోసం కొన్ని చర్యలు చేపడుతున్నాం. సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయనున్నాం. కోటిరెడ్డిసర్కిల్, వైజంక్షన్, అంబేడ్కర్ సర్కిల్, సెవెన్‌రోడ్స్ అప్సరా, క్రిష్ణాసర్కిల్‌లో త్వరలోనే సిగ్నల్స్ ఏర్పాటు చేస్తాం. ప్రాధాన్యత పరంగా కడప నగరంలో అభివృద్ధి పనులు పూర్తిచేస్తాం. ఇప్పటికే రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి అంబేడ్కర్ సర్కిల్, జిల్లా కోర్టు, కోటిరెడ్డిసర్కిల్ మీదుగా డ్రైనేజీని పూర్తి చేస్తున్నాం.

పేదలకు ఇంటి స్థలాలు, సాగుభూమి ఇవ్వండి

- కలెక్టరేట్ ముట్టడిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు, సాగుభూమి ఇచ్చే వరకు పోరాటం చేస్తామని ప్రభుత్వం స్పందించకపోతే చలో అసెంబ్లీకి పిలుపునిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. పేదలకు ఇంటిస్థలాలు, సాగుభూమి సాధనకై సీపీఐ చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా సోమవారం కడప కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, రెండు ఎకరాల సాగుభూమి హామీ తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో కేవలం ఒక సెంటు ఇంటి స్థలం, రూ.1.80లక్షలు ఇచ్చిందని.. ఆ స్థలము, డబ్బు సరిపోదని నూటికి 90శాతం మంది నిర్మాణానికి ముందుకు రాలేదన్నారు. పేదలకు ఇంటి స్థలం ఇవ్వడానికి నిరాకరిస్తున్న అధికారులు విలువైన ప్రభుత్వ వంక, వాగు, చెరువు, రస్తా, అసైన్డ్, దేవదాయ, ఇనాం, వక్ఫ్, గుట్టలు, అటవీ భూములు చివరకు శ్మశానాలను కూడా వదలకుండా ఆక్రమించి సొమ్ముచేసుంటున్న మాఫియాకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. రీసర్వే, 22ఏ చట్టసవరణ (ఫ్రీహోల్డ్), ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రభుత్వ భూములకే కాకుండా ప్రైవేటు ఆస్తులకు కూడా రక్షణ లేకుండా పోతుందని ప్రజలు తీవ్ర అభ్యంతరం తెలిపి గత ప్రభుత్వానికి బుద్ధిచెప్పారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం తిరిగి వాటిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ జిల్లాలో తప్పుడు డాక్యుమెంట్లతో అడ్డగోలుగా భూములను మ్యుటేషన్ చేయించుకున్న ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. దశాబ్దకాలంగా నివాసముంటున్న పోరుమామిళ్ల మండలం తిరుపతిరెడ్డి కాలనీ, బద్వేలు మండలంలోని భగత్‌సింగ్ నగర్, సి.కొత్తపల్లె, సీఆర్ నగర్, భాకరాపేట సీపీఐ కాలనీ, గోపవరం మండలంలోని వీపీకుంటలోని సీపీఐ పేదల కాలనీల్లో పట్టాలివ్వకుండా, మౌలిక సదుపాయలు కల్పించకుండా వివక్ష చూపుతున్నారన్నారు. గ్రామాల్లో భూమిలేని నిరుపేదలకు సాగుభూమి కేటాయింపుల్లో అధికారపార్టీ నేతలు చేతివాటం ప్రదర్శించి నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేశారన్నారు. అనంతరం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సభ్యులు ఎన్.వెంకటశివ, ఎల్.నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కొప్పర్తి భూములకు స్టాంపు డ్యూటీ మినహాయింపు



కలికిరి/కడప ఎడ్యుకేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు అనుసంధానమైన సీకే దిన్నె మండలంలోని కొప్పర్తి, తాడిగొట్ల పారిశ్రామికవాడల్లోని భూములను బదలాయించడానికి అవసరమైన రూ.65.40 కోట్ల స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములకు మినహాయింపు ఇస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రోగ్రాం కింద ఈ 2595.40 ఎకరాల భూములను ఏపీఐఐసీ నుంచి ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐసీడీసీ)కు బదలాయించాల్సి ఉంది. ఏపీఐఐసీ నుంచి ఈ భూముల బదలాయింపు కోసం భూముల మతింపు మేరకు (ఎకరా రూ.33.60 లక్షలు) నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్టు (ఎన్ఐసీడీఐటీ) రూ.872.07 కోట్లు మంజూరు చేసింది. ఏపీఐఐసీ నుంచి భూములు బదలాయింపు అనంతరం కారిడార్‌లో ఫేజ్-1లో అవసరమైన మౌలిక సదుపాయాల పనులు ప్రారంభించనున్నారు. ఈ భూముల బదలాయింపు కోసం స్టాంపు డ్యూటీ కింద రూ.43.60 కోట్లు, రిజిస్ట్రేషన్ రుసుముల కోసం రూ.8.72 కోట్లు, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ కింద మరో రూ.13.08 కోట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేన్ శాఖకు చెల్లించాల్సి వుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవసరమైన ఈ మొత్తం రూ.65.40 కోట్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా మినహాయింపునిస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఫీజుల మినహాయింపునకు సంబంధించి రెండు వేర్వేరు నోటిఫికేషన్లు కూడా జారీ చేశారు.

అధికారులే పరిశీలించి పరిష్కరించాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సంబంధించి అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు వస్తున్నారన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి నిర్దీత గడువులోగా పరిష్కరించాలన్నారు.

ఈ సందర్భంగా కడప పాలెంపల్లికి చెందిన లక్ష్మీ తాను నిరుపేదనని, బాడుగ ఇంటిలో జీవనం సాగిస్తున్నానని, తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అట్లూరు మండలం కోట గ్రామంలో తమ ఇల్లు భూసేకరణలో పోయిందని, అధికారులు పరిశీలించి నష్టపరిహారం ఇప్పించాలని బద్వేలులో నివాసం ఉంటున్న మౌలాలి బాషా కోరారు. అట్లూరు వరికుంట్ల గ్రామానికి చెందిన వెంకటరమణ తమ వ్యవసాయ భూములు సోమశిల ముంపునకు గరయ్యాయని, ఇంటిస్థలం మంజూరు చేసి ఆదుకోవాలని అభ్యర్థించారు. చాపాడు మండలం చిన్నగురువలూరు గ్రామానికి చెందిన ఎం.అనిత తన భర్త మరణించారని వితంతు పెన్షన్ ఇప్పించాలని అర్జీ సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీలను కలెక్టర్ పరిశీలిస్తూ, వారి సాధక బాధలు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా అధికారులు నాగేశ్వరరావు, పీఎస్ బాబు, వెంకటపతి, డాక్టర్ నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉండాలి

- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్దీత గడువులోగా పరిష్కరించాలని, బాధితులకు పోలీసులు అండగా ఉండాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీసుస్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేస్తామన్నారు.

పూర్తయిన ఆర్టీపీపీ-ప్రొద్దుటూరు రోడ్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రగుంట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎంతో కీలయమైన ఆర్టీపీపీ- ప్రొద్దుటూరు రోడ్డు ఎట్టకేలకు పూర్తయింది. నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో తిరిగేవి. ముఖ్యంగా ఆర్టీపీపీ నుంచి ముద్దనూరు జాతీయ రహదారి మీదగాఆ చిలమకూరు, చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రొద్దుటూరుకు రాకపోకలు సాగేవి. గతంలో భారీ గుంతలతో, వర్షం వస్తే బురదమయం అయి అత్యంత దారుణంగా ఉండేది. ఎన్నో ప్రమాదాలు జరిగి, ఎంతో నష్టం జరిగిన సందర్భాలున్నాయి. కొందరు వికలాంగులుగా మారగా మరికొందరు ప్రాణాలనే పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ రోడ్డు విషయమై అనేకసార్లు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితం అయ్యాయి. గత ఏడాది జూన్ 8న 'ఎన్నేళ్లిలా..?' ఆర్టీపీపీ రోడ్డును పట్టించుకోరా.. అంటూ మరోసారి కథనం ప్రచురితమైంది. అప్పటికే కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఏపీ జెన్‌కో అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే నేరుగా జెన్‌కో ఎండీని కలిసి రోడ్డుకు నిధులు కేటాయింపజేశారు. శరవేగంగా టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టించారు. దీంతో రోడ్డు పనులు పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది.

నాడు - నేడు



గతంలో ఆర్టీపీపీ-ప్రొద్దుటూరు రోడ్డు దుస్థితి




ప్రస్తుతం ఆర్టీపీపీ-ప్రొద్దుటూరు రోడ్డు స్థితి

ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద ఘర్షణ

- ఉద్రిక్తత... భారీగా పోలీసుల మోహరింపు
- ఇరువర్గాలు ఎన్డీయేకి చెందినవారే...

7



మద్యం షాపులకోసం గీత కులాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించి 14 మద్యం షాపులకు గీతాకులాల నుంచి దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ తెలిపారు. కడప నగరంలోని ఈఎస్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రాష్ట ప్రభుత్వం గీత కులాలకు సంబంధించి జిల్లాలో 14 షాపులు కేటాయించిందని, వీటికి ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తుతో పాటు కులధ్రువీకరణ పత్రం ఉండాలని, ఏ జిల్లాకు చెందిన వారు ఆ జిల్లాలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 7న కలెక్టర్ ఆధ్వర్యంలో సభాభవన్‌లో లాటరీ ద్వారా మద్యం దుకాణాల ఎంపికలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కడప ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు బోల్తా.. 11 మందికి గాయాలు



గుడిపాడు వద్ద బోల్తాపడిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

దువ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు సమీపంలో హైదరాబాదు నుంచి చిత్తూరుకు వెళుతున్న జగన్ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు సోమవారం తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 11 మందికి స్వల్ప గాయాలైనట్లు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. గాయపడిన వారిలో చిత్తూరులోని ఒకే కుటుంబానికి చెందిన 10 మంది ఉన్నారన్నారు. వీరిని ప్రాథమిక చికిత్స నిమిత్తం మైదుకూరుకు.. అనంతరం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరుస చోరీలతో భయం భయం

- సన్నుపల్లెలో ఇంట్లో దొంగతనం
- 13 తులాల బంగారు, రూ.1.5 లక్షల నగదు అపహరణ



సన్నుపల్లెలో చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న సీఐ

ఖాజీపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుసదొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకుగురవుతున్నారు. ఆదివారం భూమాయపల్లెవద్దగల భీమలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీకి పాల్పడగా.. సోమవారం తెల్లవారుజామున సన్నుపల్లె గ్రామానికి చెందిన తుమ్మలూరు రవీంద్రారెడ్డి ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డారు. రవీంద్రారెడ్డి మిద్దెపైన నిద్రిస్తుండగా కింద ఇంటి తలుపుల తాళాలు తొల గించి లోనికి ప్రవేశించి బీరువాలోని 13 తులాల బంగారు,రూ.1.50లక్షలు నగదు చోరీ చేశారు. ఉదయం యజమాని కిందకు వచ్చి దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు సీఐ సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్‌టీంను పిలిపించి నమూనాలను సేకరించి దొంగలకోసం గాలింపు చేపడుతున్నామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

80 మద్యం సీసాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్

కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకులోని ఫక్కీరుపల్లెలో దాడులు నిర్వహించి ఇరువురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ తెలిపారు. చిన్నచౌకులోని ఎక్సైజ్ పోలీసుస్టేషనులో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కడపకు చెందిన శివయ్య, బొల్లు బాలక్రిష్ణలు మిలిటరీకి చెందిన 80 (750 ఎంఎల్) మద్యం సీసాలను ఇరువురు ద్విచక్ర వాహనంలో తీసుకెళుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. మద్యంబాటిళ్లు, బైకు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండుకు తరలించినట్లు తెలిపారు. మద్యం, బైకు విలువ రూ.2.65 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది నరసిరహారావు, చంద్రశేఖర్, గురు ప్రసాద్‌లు పాల్గొన్నారు. పట్టుబడిన మద్యంసీసాలు మిలిటరీకి చెందిన పేర్లున్నప్పటికీ అందులో నకిలీవిగా ఉన్నట్లుగా గుర్తించి క్వాలిటీ టెస్టు కోసం పంపినట్లు సీఐ తెలిపారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం దొరల గోరీల వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. నగరంలోని దండోరా కాలనీకి చెందిన జూటూరు దస్తగిరి దొరల గోరీల వద్ద బెల్టుషాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం బాటిళ్లు అమ్మేవాడు. ఈ సమాచారం రావడంతో ఎస్‌ఐ హుసేన్ సిబ్బందితో కలిసి దాడి చేసి దస్తగిరిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 19 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని.. నిందితున్ని రిమాండుకు తరలించామని తెలిపారు.

బావపై బామ్మర్ది దాడి



కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అశోక్‌నగర్‌లో సోమవారం ఉదయం బావపై బామ్మర్ది దాడి చేశా డు. ఈ దాడిలో బావ తలకు గాయమైం ది. అశోక్‌నగర్‌కు చెందిన దివాకర్ అతని బావ మరిది దినకర్‌ల మధ్య మనస్పర్థలు ఉండేవి. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య మాటమాట పెరగడంతో దివాకర్‌పై దినకర్ రాయితో దాడి చేయగా తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బాధితుడు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయ భూములపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- 63 ఎకరాల కౌలు విషయం తేల్చాలని వినతి
- స్పందించిన కలెక్టర్.. న్యాయం చేస్తామని హామీ



కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న కలమల్ల వాసులు

ఎర్రగుంట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాత కలమల్లలోని సిద్ధేశ్వర స్వామి ఆలయానికి చెందిన మాన్యం భూముల కౌలు చెల్లింపు, అన్యాక్రాంతంపై ఆలయ అభివృద్ధి కమిటీ, సర్పంచి, ఉపసర్పంచులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలమల్ల గ్రామానికి చెందిన సుమారు 200 మంది గ్రామస్థులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. 2011 నుంచి నేటి వరకు కొత్త కలమల్ల ఆలయ కమిటీకి కౌలును కేటాయిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న దేవదాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వివరాల్లోకి వెళితే.. పాత కలమల్ల గ్రామంలో సిద్ధేశ్వరస్వామి ఆలయానికి 60 ఎకరాలు మాన్యం కింద కేటాయించారు. కాగా, అదే గ్రామంలో సర్వే నెంబరు 399/1లో ఒక రైతు పొలంలో శివాలయం నిర్మించారు. దీన్ని సిద్ధేశ్వరస్వామి ఆలయంగా పరిగణించి.. దేవదాయ అధికారులు 2011 నుంచి నేటి వరకు పాత సిద్ధేశ్వరస్వామి మాన్యం భూములను కౌలుకు కేటాయిస్తున్నారు. దీంతో గ్రామంలోని ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయి.. వారి మధ్య వైషమ్యాలు తారాస్థాయికి చేరాయి. ఈ విషయంపై పాత కలమల్లలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీకి చెందిన మాజీ సర్పంచి వి.క్రిష్ణయ్య, పి.శ్రీను, పి.సూర్యుడు, నారాయణ, గిరి, పి.శ్రీనివాసులు, శంకరయ్య, రామాంజనేయులు, ధనుంజయరెడ్డి, సాంబశివారెడ్డి, సర్పంచి సి.హెప్సీబా, ఉప సర్పంచి పంజగల విజయలక్ష్మి, గ్రామ ప్రజలు సోమవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తిగా విచారించి న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఎండోమెంట్, రెవెన్యూ, కలెక్టర్ కార్యాలయ అధికారులతో కమిటీ వేసి సున్నితమైన ఈ అంశాన్ని వెంటనే పరిష్కరించాలని దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్‌ను ఆదేశించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి 15 రోజులలోపు నివేదికను తనకు సమర్పించాలని ఆదేశించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు ఆనందకరం

- బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు పీరయ్య



దుస్తులు అందజేస్తున్న పీరయ్య

కడప మారుతీనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాలో రాణిస్తూ.. సామాజికంగా సేవలందిస్తున్న నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు దక్కడం ఆనందకరమని జిల్లా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు వి.పీరయ్య అన్నారు. బాలయ్య సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారానికి ఎంపిక చేయడం.. బాలయ్య నటించిన అఖండ, వీర సింహారెడ్డి, భగవంత్ కేసరి, ఢాకూ మహారాజ్ సినిమాలు కడప సినీ చరిత్రలో కోటి రూపాయలకు పైగా వసూళ్ళు సాధించి సరికొత్త రికార్డు సృష్టించాయి. ఈ సందర్భాన్నా పురస్కరించుకొని పీరయ్య ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అప్సరా థియేటర్‌వద్ద అభిమానుల సమక్షంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అప్సరా థియేటర్ సిబ్బదికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ, రాజకీయ, సేవారంగాలలో సేవలందించడంలో బాలయ్య ముందు వరసలో వుంటారన్నారు. ఆ అవార్డులు ఎప్పుడో రావాల్సి వుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం గుర్తించి బాలయ్యకు పద్మపురస్కారానికి ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు బాలయ్య అభిమానులు పాల్గొన్నారు.

'జ్యోతి'లో కూల్చివేతలను అడ్డుకున్న భక్తులు



కాశినాయన క్షేత్రంలో కూల్చివేతలను అడ్డుకుంటున్న భక్తులు

కాశినాయన, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాశినాయన జ్యోతిక్షేత్రంలో ఫారెస్ట్ అనుమతులు లేకుండా భవనాలు నిర్మించారంటూ సోమవారం ఫారెస్ట్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేతకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కాశినాయన భక్తులు పెద్దఎత్తున జ్యోతిక్షేత్రానికి చేరుకొని నిర్మాణాల కూల్చివేతలను అడ్డుకున్నారు. ఈసందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ కాశినాయన ఆలయ నిర్మాణానికి సంబంధించిన అనుమతుల కోసం ఆలయ నిర్వాహకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరుపుతున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఫైల్ కేంద్ర ప్రభుత్వంలోని అటవీశాఖ మంత్రి వద్దకు చేరిందన్నారు. కొంత సమయం ఇస్తే అనుమతులు తెచ్చుకుంటామంటూ ఫారెస్ట్ అధికారులను కోరారు. దీంతో ఫారెస్ట్ అధికారులు వెనుదిరిగి వెళ్లారు.

పంజాబ్ విజయ లక్ష్యం... 140 పరుగులు

కడప స్పోర్ట్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా-పంజాబ్ జట్ల మధ్య జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా మూడవ రోజైన సోమవారం ఆట ముగిసే సమయానికి పంజాబ్ జట్టు విజయానికి మరో 140 పరుగుల దూరంలో నిలిచింది. వివరాలిలా....తొలుత ఈనెల 25న బ్యాగింగ్ చేసిన ఆంధ్రా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు 45.1 ఓవర్లలో 119 పరుగులకు ఆలైట్ అయింది. దీంతో రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్రాజట్టు 62.1 ఓవర్లలో 162 పరుగులకు చేతులెత్తేసింది. ఇందులో ప్రసాద్ 68 పరుగులు చేశారు. దీంతో పంజాబ్ జట్టుకు విజయలక్ష్యంగా 255 పరుగులు నిర్దేశించింది. విజయమే లక్ష్యంగా బరిలోకి దిగిన పంజాబ్ జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 115 పరుగులు చేసింది. జస్కారన్‌వీర్ సింగ్‌పాల్ 56 పరుగులతో, ఉదయ్ సాహరన్ 57 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. కాగా విజయానికి చివరి రోజైన మంగళవారం మరో 140 పరుగుల దూరంలో వుంది.

సుండుపల్లె రెసిడెన్షియల్ స్కూల్‌కు అదనపు నిధులు మంజూరు

కలికిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లెలోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని బాలుర రెసిడెన్షియల్ పాఠశాలగా మార్చేందుకు అదనంగా మరో రూ.8.10 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ పాఠశాల నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టరు 3.9 శాతం ఎక్కువగా టెండర్ వేసినందువల్ల అంచనా వ్యయం పెరిగింది. అంతేగాకుండా కొత్త మరుగుదొడ్ల బ్లాక్‌కు సెప్టిక్ ట్యాంకు నిర్మించినందుకు కూడా అదనపు నిధులు అవసరమయ్యాయి.

117 జీఓ ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు అసంబద్ధం

కడప ఎడ్యుకేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల మూసివేత, ఉపాధ్యాయుల సంఖ్య కుదింపు లక్ష్యంగా జీఓ నెంబర్ 117కు ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు ఈ ప్రభుత్వం విడుదల చేసినట్లుగా ఉందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక విద్యకు పాతర వేస్తూ తీసుకువచ్చిన జీఓ నెంబర్ 117 రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు, మేధావులు చేసిన పోరాటాల ఫలితంగా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న నేటి విద్యాశాఖ మంత్రి గతంలో పాదయాత్ర చేస్తూ 117 రద్దు చేస్తామని తెలిపారన్నారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత 117కు ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత మార్గదర్శకాలు ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించే విధంగా కాక మరింత అదఃపాతాళానికి నెట్టివేసే విధంగా ఉన్నాయని ఆరోపించారు. జిల్లా ట్రెజరర్ కె.నరసింహరావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భారత్ షూటింగ్ బాల్ జట్టుకు మహమ్మద్ యూసఫ్ ఎంపిక



మదనపల్లె అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు జరగనున్న ఏషియన్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే భారత జట్టులోకి మదనపల్లె పట్టణానికి చెందిన సీనియర్ షూటింగ్‌బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసఫ్‌బాష ఎంపికైనట్లు షూటింగ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు అందాయి. ఈనెల 30వ తేదీ ఢిల్లీలో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటారు. భారత్ జట్టుకు ఎంపికైన క్రీడాకారునికి ఏపీ షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పరుశురాముడు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దక్షిణ భారతదేశం నుంచి మదనపల్లెకు చెందిన యూసఫ్‌బాష ఎంపిక కావడం మదనపల్లెకే గర్వకారణమని జిల్లా కార్యదర్శి గౌతమి, నరేశ్ తెలిపారు. యూసఫ్ బాష అంతర్జాతీయ పోటీల్లో రాణించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని కోచ్, అన్నమయ్య షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనివాస్, సాగర్, కోశాధికారి సాయిశేఖరెడ్డి, సభ్యులు నాగేంద్రప్రసాద్, పవన్, సురేష్, సయ్యద్‌భాష, భారతి, మురళీ, క్రీడాభారతి అధ్యక్షులు దిలీప్‌కుమార్, విజయ్‌కుమార్, కరాటే సురేష్, క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్‌బాష , సీనియర్ క్రీడాకారులు మురళీ, ఉదయ్, శ్రీకుమార్, అభినందించారు.

అంతర్ జిల్లా బదిలీతో కడపకు కొత్త పంచాయతీ కార్యదర్శి

కలికిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కంభం మండలంలోని ఎర్రబాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న చల్లా స్వప్నను కడప జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. భార్యాభర్తల కేటగిరీ కింద బదిలీ కోసం ఆమె చేసిన దరఖాస్తును ప్రభుత్వం పరిశీలించిన అనంతరం బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఆ మేరకు స్వప్నకు నియామక ఉత్తర్వులిచ్చేందుకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం అనుమతించింది. ఆశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఈ ఉత్తర్వులు విడుదల చేశారు.

ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద ఘర్షణ

- భారీగా పోలీసుల మోహరింపు
- ఇరువర్గాలు ఎన్డీయేకి చెందినవారే...
- 30మందిపై కేసు నమోదు..?

ఎర్రగుంట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద లోడింగ్‌లో ఆధిపత్య పోరు సాగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఎన్డీయేకి చెందిన ఒక వర్గం వారు మరో వర్గంవారిపై దాడి చేశారు. ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద కలమల్లకు చెందిన సంజీవరెడ్డి, అతని అల్లుడు నారాయణరెడ్డి, సోదరుడు విద్యాసాగర్‌రెడ్డిలు కొన్ని సంవత్సరాలుగా ప్రొక్లైన్ పెట్టుకుని లోడింగ్ చేస్తు న్నారు. అయితే ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత కొండాపురం మండలంలోని చౌటపల్లె (పోట్లదుర్తి ఆర్ అండ్‌ఆర్ సెంటర్‌లో నివాసం ఉంటున్న)కు చెందిన వెల్లాల రామ్మోహన్‌రెడ్డి కూడా ప్రొక్లైన్ పెట్టి లోడింగ్ చేస్తున్నాడు. అయితే ఇటీవల సంజీవరెడ్డి అల్లుడు నారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి మధ్య లోడింగ్ విషయంలో వాగ్వాదాల జరిగాయి. ఈ నేపథ్యంలో ఆదివారం కూడా ఘర్షణ జరిగినట్లు సమాచారం. అయితే సోమవారం మాట్లాడుకుందాం రా అంటూ సంజీవరెడ్డి ఫోన్‌లో రామ్మోహన్‌రెడ్డిని పిలిచారు. దీంతో సుమారు 50మందితో వచ్చిన రామ్మోహన్‌రెడ్డి సంజీవరెడ్డిపై కట్టెలతో దాడి చేశారు. అలాగే యాష్‌పాండ్ వద్ద నున్న సంజీవరెడ్డి అల్లుడు మరికొందరిపై దాడి చేసి గాయపరిచారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు కొండాపురం, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు సీఐలు, ఎస్‌ఐలు పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. దాడులకు పాల్పడ్డ వెల్లాల రామ్మోహన్‌రెడ్డి, మరొ కొందరిపై, సంజీవరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, నారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈవిషయంపై కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీని వివరణ కోరేందుకు ఫోన్‌చేసినా ఎత్తకపోవడం గమనార్హం. కాగా, ఈవిషయంపై దేవగుడిలో ఇరువర్గాల మధ్య రాజీ చేసినట్లు సమాచారం.

హుండీ ఆదాయం రూ.10.24 లక్షలు

గుర్రంకొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి హుండీని సోమవారం టీటీడీ అధికారులు లెక్కించారు. స్వామి వారికి నాలుగు నెలలకు హుండీ ద్వారా రూ.10,24,720 ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. ఈ మొత్తాన్ని టీటీడీ అభివృద్ధికి వినియోగించనుంది. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి రూ.2.73 లక్షల ఆదాయం

తంబళ్లపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయానికి పరకామణి (హుండీ) ద్వారా రూ.2,73,320 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సోమవారం ఆలయంలో టీటీడీ అధికారులు, ఏఈవో గోపినాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్ ఆధ్వర్యంలో అక్టోబరు నుంచి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువతి అదృ శ్యంపై కేసు నమోదు చేసిన ట్లు టూటౌన్ సీఐ రామచంద్ర పేర్కొన్నారు. మదనపల్లె పట్టణం నెమలినగర్ సమీపంలోని వడ్డిపల్లెకు చెందిన వెంకటర మణ కుమార్తై నాగలక్ష్మి (23) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బాధితురాలు తండ్రి ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూలవంక బ్రిడ్జీపై రాకపోకలు బంద్



మూలవంక బ్రిడ్జీపై రాకపోకలకు అడ్డుగా కట్టిన గోడ

సికెదిన్నె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చింత కొమ్మదిన్నె మండలం మూలవంక వద్ద జాతీయ రహదారిపై నిర్మించిన బ్రిడ్జీ పాడుబడడంతో అడ్డుగా గోడను కట్టి జాతీయ రహదారి అధికారులు రాకపోకలు నిలిపేశారు. ఈ ప్రాంతాన్ని సోమవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అఖిలపక్ష నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారులు, ప్రభుత్వ స్థలాలు, శ్మశానాలు, చెరువులు, వంకలు, భూములను బలవంతంగా స్వాధీనం చేసుకున్న భావన టౌన్‌షిప్ పునాదులను పెకిలించేవరకు పోరాటం చేస్తామన్నారు. 2000 నుంచి 2019 వరకు ప్రభుత్వ భూమిగా ఉన్న ఆ స్థలం కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ముఖ్య అనుచరుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రరెడ్డి భూమిని కొన్న తర్వాత ఎలా రిజిస్ట్రర్ అయిందో తెలపాలని అధికారులను నిలదీశారు. 2019లో ఇదే భూమిని అయిదు ఎకరాలు లేవాకు మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీదేవి అనే వారు దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని డీజీకి గుమ్మా రాజేంద్రనాథరెడ్డి ఫిర్యాదు చేయడం నిజం కాదా, తర్వాత కాలానికి అదే భూమిని ఆయన ఎలా రిజిస్ట్రేషన్ చేసుకున్నారో తెలుపాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ నేతల పాపం పండిందన్నారు నాడు నేషనల్ హైవే ఈఈ వారికి సహకరించారో ఈరోజు అదే ఈఈ భావన టౌన్‌షిప్ ప్రధాన రహదారికి అడ్డుగోడ కట్టారని ఇప్పటికైనా ఆ అధికారి తనప్పును తాను తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, గంధం మోహన్‌బాబు, క్రిష్ణారెడ్డి, సిద్ధరామయ్య, మక్బుల్‌బాషా, ప్రసాద్, మునిరెడ్డి, వీరకుమార్, సుబ్బనరసయ్య, పీర్‌ప్రసాద్, నాగేంద్రారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన ఎస్పీకి శుభాకాంక్షలు



ఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న వారణాసి ప్రతాప్‌రెడ్డి, సానె శ్రీనివాసులు

కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఈజీ అశోక్‌కుమార్‌ను ప్రముఖ షుగరు వ్యాధి నిపుణుడు సువర్ణభారతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాక్షలు తెలిపారు. అనంతరం ఆయన్ను సన్మానించారు.

ఎస్పీని కలిసిన సాయిబాబా ఐరన్ మార్ట్ అధినేత

ప్రముఖ వ్యాపార వేత్త సాయిబాబా ఐరన్ మార్ట్ అధినేత సానె శ్రీనివాసులు సోమవారం ఎస్పీ అశోక్‌కుమార్‌ను పోలీసు గెస్ట్ హౌస్‌లో కలిశారు. ఆయన్ను దుశ్శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు.

బిల్లులు లేని వాహనాలు సీజ్

పులివెందుల టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బిల్లులు లేకుండా తరలిస్తున్న నాలుగు వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించినట్లు సేల్‌ట్యాక్స్ అధికారి అనిత తెలిపారు. సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నాలుగు వాహనాల్లో తరలిస్తున్న సరుకుకు ఎటువంటి బిల్లులు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి పులివెందుల పోలీసుస్టేషనుకు తరలించారు. వీటిలో మూడు వాహన యజమానులు ఒక్కో వాహనానికి రూ.50వేలు చొప్పున జరిమానా చెల్లించారని ఆమె తెలిపారు. కుర్‌కురే ప్యాకెట్లు తరలించే వాహనంలో గంజాయి వంటి మత్తు పదార్థాలు ఉండడంతోనే వాహన యజమానులు జరిమానా కట్టడానికి రాలేదని తెలుస్తుంది. మంగళవారం అందరి సమక్షంలో వాహనంలో ఉన్న సరుకులను పరిశీలిస్తామని ఆమె తెలిపారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

సింహాద్రిపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్‌ను రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి అంగడి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, జిల్లా అకడమిక్ కన్వీనర్ విజయవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి సోదరుడు మారెడ్డి మాధవరెడ్డి ఆర్థిక సాయంతో పంపిణీ చేసినట్లు తెలిపారు.

నేడు పులివెందులలో కలెక్టర్ పర్యటన

పులివెందులటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టరు చెరుకూరి శ్రీధర్ మంగళవారం పులివెందుల నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు టీడీపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలో ప్రధానంగా నిలిచిపోయిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడానికి, అలాగే ఇటీవల పూర్తి చేసిన సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను ప్రారంభించడానికి వస్తున్నారన్నారు.

శివారు ప్రాంతం.. సమస్యల నిలయం

- కుక్కల స్వైరవిహారం
- పలుచోట్ల ఎత్తైన స్పీడ్ బ్రేకర్లు
- దోమల విజృంభణ
- వెలగని వీధి దీపాలు
- అశోక్‌నగర్‌లో దుస్థితి ఇదీ
- నేడు చర్చావేదిక



అశోక్‌నగర్‌లో వెలగని వీధి దీపం... వృద్ధుడిని అడ్డగించిన కుక్కలు



కడప నగర శివారు ప్రాంతమైన అశోక్‌నగర్ సమస్యలకు నిలయమైంది. వెలగని వీధిదీపాలు... ఎక్కడపడితే అక్కడ స్పీడ్‌బ్రేకర్లు... కుక్కలు, పందుల స్వైరవిహారం... రాత్రయితే దోమల దాడి... ఇలా అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు.. మా ప్రాంతంపై చిన్నచూపెందుకని, ఓట్లు అడగడానికి తప్ప మా కష్టాలు ఎవరికీ పట్టవా... అని ప్రశ్నిస్తున్నారు.

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లోని 5వ డివిజన్ అశోక్‌నగర్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. సుమారు 15 ఏళ్లుగా ఈ ప్రాంతం మురికివాడగానే ఉండిపోయింది. నగరానికి శివారున ఉండడంతో పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ డివిజన్ ప్రజలు నిత్యం సమస్యలతో ఇబ్బందులు పడుతుఆన్నరు. కేసీ కెనాల్ గట్టు వెంబడి నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో దోమల తీవ్రత ఎక్కువైంది. దోమల బెడదతో రాత్రివేళ ఆరుబయట ఒక్కక్షణం కూడా ఉండలేని పరిస్థితి. వీటితో పాటు కుక్కలు, పందులు, రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

కుక్కల స్వైరవిహారం

అశోక్‌నగర్‌లో ఒకటి కాదు... రెండు కాదు.. కనీసం పదికి తక్కువ కాకుండా కుక్కలు వీధుల్లో స్వైరవిహారం చేస్తుంటాయి. వాహన చోదకులపై దాడులు చేస్తూ గాయపడరుస్తున్నాయి. వీధుల్లో సంచరిస్తూ పాదచారులను భయపెడుతున్నాయి. కుక్కను చూస్తే తప్పించుకొని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుక్కల నియంత్రణ అటకెక్కడతో వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గత కొంతకాలంగా సంతానోత్పత్తి తగ్గించే చర్యలు కార్పొరేషన్ చేపట్టలేదని తెలుస్తోంది. దీంతో కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది.

భయపెడుతున్న స్పీడ్ బ్రేకర్లు

అశోక్‌నగర్‌లో స్పీడ్ బ్రేకర్లు మరో ప్రధాన సమస్యగా మారింది. ప్రతి వీధిలో స్పీడ్ బ్రేకర్లు దర్శనమిస్తాయి. వాహనదారులకు ఇదోపెద్ద సమస్య. ఏమాత్రం ఏమరపాటుతో వాహనం నడిపినా స్పీడ్ బ్రేకర్ల వద్ద కిందపడాల్సిందే. స్పీడ్ బ్రేకర్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కూడా ఆంక్షలు విధించింది. అయితే కార్పొరేషన్ అధికారులు దృష్టిసారించకపోవడంతో ఎవరికి వారు ఇళ్లముందు స్పీడ్ బ్రేకర్లు వేసుకుంటున్నారు. వాహనదారులు, పాదచారులు ఇబ్బందికి గురవుతున్నారు.

దోమల విజృంభణ

ఈ ప్రాంతలో సాయంత్రం అయితే దోమల విజృంభణ ప్రారంభమవుతుంది. కేసీ కెనాల్‌లో పూడికలు తీయకపోవడంతో మురుగునీరు నిలిచిపోయింది. దీంతోపాటు ఈ ప్రాంత వాసులు చెత్తాచెదారం కూడా కాల్వలోనే వేయడంతో మురుగుపారేందుకు వీలు లేకుండా పోతోంది. దీంతో దోమల తీవ్రత ఎక్కువైంది. దోమల బెడదతో సాయంత్రం నుంచి ఆరుబయటకు రావాలంటేనే స్థానికులు ఇబ్బందిపడుతున్నారు.

వెలగని వీధి దీపాలు

కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. చీకటి పడితే చాలు స్థానికులు భయంతో అల్లాడుతున్నారు. శివారు ప్రాంతం కావడంతో కుక్కలు, పందులతో పాటు పాములు, విషపురుగులు కూడా ఈ ప్రాంతంలో అధికంగా ఉన్నాయి. కనీ సం వీధి దీపాలు ఉన్నట్లయితే ప్రజలకు కొంతైనా మేలు కలుగుతుంది. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేటట్లు చూడాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో చర్చావేదిక

అశోక్‌నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో చర్చావేదిక జరగనుంది.

కుక్కలు, పందుల బెడద తప్పించండి



అశోక్‌నగర్‌లో కుక్కలు, పందులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఒంటరిగా వెళ్లాలంటేనే భయమేస్తోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఒక్కసారిగా గుంపులుగా వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అధికారులు స్పం దించి కుక్కలు పందుల బెడద నుంచి మమ్మల్ని తప్పించాలి. - సుబ్బలక్ష్మి, అశోక్‌నగర్


స్పీడ్ బ్రేకర్లు తొలగించాలి



అశోక్‌నగర్‌లో ప్రతి వీధిలో ఇళ్ల ఎదుట ఎక్కువగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. అవికూడా చాలా ఎత్తుగా ఉన్నాయి. దీంతో వాహనాలపై వెళ్లాలంటేనే చాలా ఇబ్బందికరంగా ఉంది. వాటి వల్ల ద్విచక్ర వాహనదారులు వెన్నునొప్పితో బాధపడుతున్నారు. వీటిని అధికారులు తక్షణం తొలగించాలి. - రామకృష్ణ, అశోక్‌నగర్



వాహనదారులకు అసౌకర్యంగా స్పీడ్‌బ్రేకరు



అశోక్‌నగర్‌లో స్పీడు బ్రేకర్లతో వాహనదారుల అవస్థలు... చెత్తకుప్పల్లో పందుల గుంపు... నిరుపయోగంగా ఉన్న విద్యుత్ దీపం

పరిశ్రమల స్థాపనకు ఏపీ అనుకూలం

- ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ అనుకూలమైనదని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతమైందన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫారం సదస్సులో ఏపీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, పరిశ్రమల స్థానకు ఎంతో అనుకూలంగా ఉందని వ్యాపార దిగ్గజాలు నమ్మడంతోనే పరిశ్రమల ఏర్పాటుకు సానుకూలత లభించిందన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వాకానికి అంధకారంలోకి వెళ్లిన పారిశ్రామికరంగానికి నూతన వెలుగులు తీసుకురావడం కోసం తండ్రీకొడుకులు రేయింబవళ్లు కష్టపడుతున్నారు. ఏఐ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో భేటీ అయ్యారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా ఐటీ మంత్రి నారాలోకేశ్ శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న అపార వనరులు, మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ పాలసీల గురించి పారిశ్రామికవేత్తలకు వివరించి పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అనువైన రాష్ట్రమని ఆహ్వానించారన్నారు. భేటీ అయిన ప్రతి పారిశ్రామికవేత్తా తమ ఎగ్జిక్యూటివ్ మెంబర్లతో చర్చించి తప్పకుండా రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెడతామని సానుకూలంగా స్పందించారన్నారు. జగన్‌రెడ్డి చేతకాని ప్రభుత్వంలా దావోస్ వెళ్లకుండా ఇంట్లో కూర్చోలేదన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్, టాటా సంస్థల చైర్మన్ చంద్రశేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలు సీఎం చంద్రబాబు విజన్‌ను మెచ్చుకోవడం రాష్ట్రంలో పెట్టుబడి పెడతామని హామీ ఇవ్వడం చంద్రబాబు విజన్ 2047 విజయాన్ని సూచిస్తోందన్నారు. గాడితప్పిన అన్ని రంగాలను చంద్రబాబు గాడిలో పెట్టారన్నారు. 2014లో విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడేందుకు విశాఖలో మూడుసార్లు పెట్టుబడుల సదస్సును నిర్వహించి దావోస్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో పర్యటించి అన్ని రంగాల్లో కలిపి రూ.11.77 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి ఏపీని బ్రాండ్ ఏపీగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఒక్క జూమ్ కాల్‌తోనే ఆర్సెలార్ మిట్టల్ అండ్ నిస్పాన్ స్టీలు కంపెనీతో మాట్లాడి రాష్ట్రానికి రూ.1.46 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చిన ఘనత నారా లోకేశ్‌కు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, మస్తానయ్య, జంపాల నరసింహారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, పల్లె రామసుబ్బారెడ్డి, బోయిళ్ల శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో కూడా రాణించాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో విద్యార్థినులను ఆయన సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు కర్లింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాణించారన్నారు. ఈ నెల 15 నుంచి జమ్ము అండ్ కాశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో జరిగిన నాలుగో జాతీయ కర్లింగ్ చాంపియన్‌షిప్ - 2025 పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారన్నారు. పదో తరగతి విద్యార్థిని బి.దీక్షిత మిక్స్ డబుల్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించగా తొమ్మిదవ తరగతి విద్యార్థిని బి.హారిక మిక్స్‌డబుల్స్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. విజేతలైన వారికి ఒకరికి రూ.10వేలు, ఒకరికి రూ.5వేలు నగదును వారికి అందించారు.

ప్రజా సమస్యలు తెలుసుకున్న యాత్ర ప్రజాగళం

పులివెందుల టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలు తెలుసుకున్న యాత్ర ప్రజాగళమని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి అన్నారు. సోమవారం పట్టణంలోని వారి నివాసంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

యువగళం తుఫాన్‌లో కొట్టుకుపోయిన వైసీపీ

కడప మారుతీనగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): యువగళం తుఫాన్‌లో వైసీపీ కొట్టుకుపోయిందని టీడీపీ తొగట వీర క్షత్రియ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడక చక్రధర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు లోకేశ్ చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుపరుస్తున్నారన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలి

కడప(వినాయకనగర్), జనవరి27(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, అభినయ్, సుమంత్, చంద్రా, అరుణ్, అశోక్, అకిరానందన్, రాజేశ్, మస్తాన్, ఉదయ్, నిత్యా, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో డీఈఓ శంషుద్దీన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యారంగ పురోభివృద్ధికి మనందరం కలిసి పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ గురయ్య, జిల్లా కౌన్సిలర్లు రామసుధాకర్‌రెడ్డి, మొహిద్దీన్ ఖాన్, రామచంద్రారెడ్డి, మస్తాన్ బాబు, నరసింహులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా: ఎమ్మెల్సీ

పులివెందుల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ - ప్రజా వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్యలు ఉన్న నేరుగా వచ్చి చెప్పుకొని పరిష్కరించుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని నియోజకవర్గాల్లో గ్రీవెన్స్-ప్రజావేదిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అలాగే యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర జైత్రయాత్రగా నడిపించారన్నారు. రెండేళ్లు పూర్తైన సందర్భంగా మంగళగిరి టీడీపీ కార్యాలయంలో యువగళం వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీకి ఎట్టకేలకు మరమ్మతులు

పులివెందుల రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాకరాపురంలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీకి ఎట్టకేలకు మరమ్మతులు చేశారు.బాకరాపురంలోని శ్రీరాముని ఆలయం మెయిన్ రోడ్డులో కొన్ని నెలలుగా తాగునీటి పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతుండేవి. నూతనంగా ఏర్పాటుచేసిన పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ కూడా ఒకే లైన్‌లో నిర్మించడంతో మరమ్మతు చేసేందుకు సమస్య నెలకొందని, అప్పట్లో మున్సిపల్ అధికారులు వివరణ ఇచ్చారు. దీనిపై ఆంధ్రజ్యోతి పలుమార్లు కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు స్పందించిన అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు: కమిషనర్

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కడప కార్పొరేషన్ వద్ద ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 22 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి సంబంధించి అధికారులకు పంపించినట్లు చెప్పారు.

ముస్లింల హక్కుల కోసం పోరాటం

కడప మారుతీనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ముస్లింల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తామని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. సోమవారం విజయవాడలోని సింగ్‌నగర్ షాదీఖానాలో ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర కమిటీ భాధ్యతలను స్వీకరించారు.

ఏపీకి భారీగా పరిశ్రమలు రాబోతున్నాయి

వరదరాజులరెడ్డి, ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు ,జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు దావోస్ పర్యటన సక్సెస్ అయ్యిందని త్వరలో ఏపీకి భారీగా పెట్టుబడులు, పరిశ్రమలు రాబోతున్నాయని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ దేశాలనుంచి వచ్చిన పారిశ్రామిక వేత్తలు అందరిని చంద్రబాబు ఏపీకి రమ్మని ఆహ్వానించారన్నారు. 15 రోజులలోపే పరిశ్రమలకు అన్ని రకాల అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. దాదాపు 20 లక్షల మేర ఉద్యోగాలు సృష్టించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్,టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, పగిడాల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిహాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న మాజీ సర్పంచ్ బూచుపల్లి గంగాధర్‌రెడ్డి

ముద్దనూరు జనవరి27(ఆంధ్రజ్యోతి):మండల పరిధి ఓబులాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విశ్రాంత తెలుగు అధ్యాపకుడు డాక్టర్ బూచుపల్లి పుల్లారెడ్డి , మాజీ సర్పంచ్ బూచుపల్లి గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి మనవడు నిహాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.బర్త్‌డే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు,వాటర్‌బాటిల్, పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు.ప్రతి ఏటా తన సొంత గ్రామం ఓబులాపురం ప్రాథమిక పాఠశాలలో మనవడు నిహాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకొంటున్నామని, ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో ఉనికికోసం జగన్‌రెడ్డిపై ఎమ్మెల్యే ఆది విమర్శలు

● ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పార్టీలో గుర్తింపుకోసం, ఉనికికోసమే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శించారు. సోమవారం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఆ పార్టీ దరిద్రపు పార్టీ అని, అందరు వెళ్లిపోతున్నారని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విమర్శించడం ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేశారని, అందరు వెళ్లిపోతున్నారని ఆదినారాయణరెడ్డి మాట్లాడడం తగదన్నారు. కూటమి ప్రభుత్వంలో డైనోసార్లు ఉన్నారన్నారు. అలాంటి కోవకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆయన అనుచరులు దోపిడీ చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం పోరాటం చేసి స్థానికంగా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోటీపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొమెర్ల మోహన్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బడుగుల కల నేరవేరింది



సంబరాలు జరుపుకుంటున్న ప్రజా సంఘనాయకులు

బద్వేలు రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగకు కేంద్రప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడం బడుగుల కల నెరవేరిందని ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు దేవానందంబాబు, నియోజకవర్గ అధ్యక్షులు ఓబయ్య, వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్, మహాజన సోషలిస్ట్‌పార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక నెల్లూరురోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కేక్‌నుకోసి సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ గౌరవాధ్యక్షుడు ఓసూరి భాస్కర్, ఎంఎస్‌పీ నియోజకవర్గ అధ్యక్షుడు గంగిపోగు నరసింహులు, కోడూరు యేసురత్నం, జాలా రాజన్న, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు జహంగీర్‌బాష, నాగిపోగు ప్రసాద్, పిచ్చయ్య పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

● ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహణ ● ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయుల కృషి



స్టడీ అవర్‌లో చదువుకుంటున్న వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు విద్యార్థినులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు 10వ తరగతి పరీక్షలు కీలకమైనవి. 10లో ఉత్తీర్ణత సాధిస్తే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చు. 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి స్టడీ అవర్స్ పేరుతో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలో జడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 21 పాఠశాలలు ఉండగా దాదాపు 1400 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు.

● వంద రోజుల యాక్షన్ ప్లాన్

విద్యాశాఖ ఆదేశాల మేరకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా డిసెంబరు 1 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం స్టడీ అవర్‌లో చదువుకున్న పాఠ్యాంశాలపై సాయంత్రం పరీక్ష నిర్వహిస్తున్నారు. పరీక్షలో విద్యార్థులు చేసే తప్పులను సరిదిద్ది వారికి మరింత తర్ఫీదును ఇస్తున్నారు. వారానికి ఒకసారి గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను విద్యాశాఖవారు అందజేశారు. దాని ఆధారంగా ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. విద్యలో వెనుకబడిన పిల్లలు కూడా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. విద్యార్థులు వెనుకబడిన సబ్జెక్టులను గుర్తించి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలను ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు నివృత్తి చేసుకున్నారు. గత సంవత్సరం మండలంలో 10వ తరగతి విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ సంవత్సరం మరింత ఎక్కువ మంది ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నారు.

ఉత్తమ మార్కులు సాధిస్తా



పరీక్షల కోసం కష్టపడి చదువుతున్నా. ఉత్తమ మార్కులు సాధిస్తా. రోజు పరీక్షలు నిర్వహించి మేము చేసే తప్పులను ఉపాధ్యాయులు సరిదిద్దుతున్నారు. స్టడీ అవర్స్ తమకెంతగానో ఉపయోగపడుతున్నాయి.

దివ్యశ్రీ, వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు

ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తా



10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడమే నా లక్ష్యం. గత సంవత్సరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని కృషి చేస్తా.

చాతుర్య, వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు

పురుగు మందులు ఎక్కువ వాడితే ఆహారం విషం

● మ్యాగి, ఏవో



చాపాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతులు విచ్చలవిడిగా పంటలకు పురుగుమందులు వాడితే ఆహారం విషం అవుతుందని మండల వ్యవసాయాధికారి మ్యాగీ తెలిపారు. ఇటీవల రైతులు పంటల దిగుబడికి పురుగు మందులు ఎక్కువగా వాడుతున్నారు. సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువు వాడితే ఆరోగ్యంగా జీవించవచ్చు. దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందన్న ఏవో మ్యాగీతో ప్రత్యేక ఇంటర్వ్యూ...

ముఖాముఖి

ప్రశ్న: పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం కింద ఎంత మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారు.

జవాబు: 8,725 మంది

ప్రశ్న: మండలంలో రైతు సేవా కేంద్రాలు ఎన్ని ఉన్నాయి.

జవాబు: 15

ప్రశ్న: రైతు సేవా కేంద్రాల్లో యూఏఏలు ఎంత మంది ఉన్నారు.

జవాబు: 13 మంది

ప్రశ్న: మండలంలోని రైతులు ఏ పంటలు సాగు చేస్తారు.

జవాబు: వరి, జొన్న, మినుము, వేరుశనగ వంటివి.

ప్రశ్న: పంటలకు ఎలాంటి తెగుళ్ల వస్తాయి.

జవాబు: ఆకు ముడత, పల్లాకు, మచ్చ తెగుళ్లు ఎక్కువగా వస్తాయి.

ప్రశ్న: ఖరీఫ్, రబీ సీజన్లలో ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు.

జవాబు: ఖరీఫ్‌లో 16 వేల ఎకరాలు, రబీ సీజన్‌లో 6 వేల ఎకరాలు సాగు చేస్తారు.

ప్రశ్న: పంటకు ప్రధాన జలవనరు ఏది.

జవాబు: కేసీ కెనాల్, బోర్లు, వ్యవసాయ ఫిల్టర్లు.

ప్రశ్న: ఉద్యాన పంటలు ఎలాంటివి సాగు చేస్తారు.

జవాబు: పసుపు, నిమ్మ, జామ.

ప్రశ్న: పంటల ఇన్సూరెన్స్ వివరాలు తెలుపండి.

జవాబు: ఎకరాకు వేరుశనగకు రూ.450, జొన్నలకు రూ.315, వరికి రూ.630 ప్రీమియం చెల్లించాలి.

ప్రశ్న: పొలం పిలుస్తోందిలో రైతులకు ఎలాంటి సలహాలు ఇస్తున్నారు.

జవాబు: పంట సాగు చేసే సమయాన్ని బట్టి విత్తనశుద్ధి, తెగుళ్ల నివారణ వంటివి సలహాలు ఇస్తాం.

ప్రశ్న: వరిలో ఎక్కువ దిగుబడి ఇచ్చే రకాలు తెలుపండి.

జవాబు: ఎన్‌డీఎల్ఆర్-718, బీపీటీ-5204, జగిత్యాల 324 రకాలు.

ప్రశ్న: మీరు వారానికి ఎన్నిసార్లు గ్రామాలకు వెళతారు.

జవాబు: వారానికి అయిదు రోజులు రోజులపాటు వెళతాను.

పెద్దిరెడ్డి మాధవరెడ్డికి ఘననివాళి



పెద్దిరెడ్డి మాధవరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

బద్వేలు రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ మేనేజర్ కీర్తిశేషులు పెద్దిరెడ్డి మాధవరెడ్డికి పలువురు ఘననివాళులర్పించారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన పెద్దిరెడ్డి మాధవరెడ్డి పెద్దకర్మ ఆయన స్వగ్రామం తంగెడుపల్లె గ్రామంలో కుమారులు పెద్దిరెడ్డి చెన్నక్రిష్ణారెడ్డి, ఆనందమోహన్‌రెడ్డి నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగిగాసుపరిచితుడైనమాధవరెడ్డికి పలువురు హాజరై ఘననివాళులు అర్పించారు.

పెన్షన్లపై విచారణ



పెన్షన్లను తనిఖీ చేస్తున్న డాక్టర్లు

కొండాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.15000 పొందు తున్న సామాజిక పెన్షన్లపై సోమవారం విచారణ చేపట్టారు.తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారిని ప్రభుత్వం నియమించిన ప్రత్యేక వైద్యబృందం డాక్టర్ నాయక్, డాక్టర్ భరత్ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. స్థానిక డాక్టర్లు సాంబశివారెడ్డి, రెహనా తో పాటు సచివాలయ సిబ్బంది తనిఖీలో పాల్గొన్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. మండలంలోని 33 పెన్షన్లు పొందుతున్న అన్ని గ్రామాలలో తనిఖీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

3న వసంత పంచమి వేడుకలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శివ దర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం రవీంద్ర హైస్కూలులో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పల్లేటి ప్రభాకరరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివసత్యానానంద మాతాజీ హాజరవుతారని ఆమె చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తారని తెలిపారు. అక్షరాభ్యాసం చేయించే చిన్నారుల తల్లిదండ్రులు 30వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

'రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని మార్చేసిన లోకేశ్'



రితీశ్‌రెడ్డి

బద్వేలుటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : యువగళం పాదయాత్ర తో రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని మార్చేసిన యువనేత నారాలోకేశ్ అని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేత బొజ్జ రోశన్న పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారా లోకేశ్ ఉద్యోగాలు లేక నిరాశతో ఉన్న యువతకు భరోసా కల్పిస్తూ, పెట్టుబడులతో దావోస్‌లో విస్తృత భేటీలతో దిగ్గజ కంపెనీలను మనరాష్ట్రానికి వచ్చేలా చేశారని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి, రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయమూర్తి సమక్షంలో సమావేశం

దువ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని మండల పరిషత్ సభాభవనంలో మంగళవారం ప్రొద్దుటూరు సివిల్ న్యాయమూర్తి ఆధ్వర్యంలో సమావేశం జరుగనున్నట్లు ఎంపీడీవో రామక్రిష్ణయ్య తెలిపారు. మహిళలకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఐసీడీఎస్, ఐకేపీ, వైద్యశాఖ, ఆశా కార్యకర్తలతోపాటు మండలంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ, అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొనాలని కోరారు.

ఎలక్ట్రీషియన్ యూనియన్ జెండా ఆవిష్కరణ



ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్లు

ప్రొద్దుటూరు అర్బన్ జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎలక్ట్రీషియన్ డే ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లేబర్ ఆఫీసర్ లోకపావని పాల్గొని ఎలక్ట్రీషియన్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జనవరి 27ను జాతీయ ఎలక్ట్రీషియన్ డే గా ప్రభుత్వం ప్రకటించాలంటూ నినాదాలతో గాంధీ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం చేరుకొని పలు ఎలక్ట్రీషియన్ల సమస్యల మీద తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాజీవ్ సర్కిల్, శివాలయం సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించామని ప్రొద్దుటూరు ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. దస్తగిరి, సెక్రెటరి మదన గోపాల్, ట్రెజరర్ నారాయణ, కమిటీ సభ్యులు, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: మండలంలోని ఎలక్ట్రీషియన్ల యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మండల కేంద్రంలో సోమవారం ఎలక్ట్రిషన్‌డేగా సందర్భంగా జెండా ఆవిష్కరణ నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు.మండల అధ్యక్షుడు చెరువుపల్లె ప్రతాపాచారి, రవికుమార్, నాగేంద్ర, నవీన్, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'వెనక్కి వెళ్లిన రూ.300 కోట్ల నిధులు తెప్పించండి'

ప్రొద్దుటూరు ,జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన తాగునీటి పైపులైను మురుగుకాలువల ఆధునికీరణ పనులకు మంజూరైన రూ. 300 కోట్ల నిధులు ఈ ప్రభుత్వంలో రద్దయ్యాయని వాటికి తిరిగి నిధులు తీసుకొచ్చి అభివృద్ధిలో పోటీ పడాలని మున్సిపల్ వైస్ చైర్మెన్ పాతకోట బంగారు మునిరెడ్డి సవాల్ విసిరారు. సోమవారం ఆయన వైసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

పాడిరైతులకు బహుమతులు

ఖాజీపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లేగదూడల ప్రదర్శనలో గెలుపొందిన పాడి రైతులకు బహుమతులను జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ అందజేశారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలో జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారాపుట్టిన లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సర్పంచ్ గంగిరెడ్డి సుబ్బమ్మ ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కృత్రిమ గర్భధారణతో పుట్టిన 55 లేగదూడలు ప్రదర్శనలో పాల్గొనడం జరిగిందని, ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను రైతులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకుడు మురళి, మునెయ్య, డీఎల్‌డీఏ శివరామిరెడ్డి, శరత్, ఉప వైద్యాధికారులు రామచంద్ర, లక్షుమయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీళ్లపైపు లీకేజీ - ఇబ్బందుల్లో రైతులు, ప్రజలు



ధర్మాపురం గ్రామం రోడ్డు పక్కన లీకేజీ అయిన పైపులు

జమ్మలమడుగు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో వారం రోజులుగా ధర్మాపురం గ్రామం దానవులపాడు మధ్య ప్రధాన రోడ్డు పక్కన పైపులు లీకేజీ అయ్యాయి. మైలవరం జలాశయం నుంచి మెగా కన్‌స్ట్రక్షన్‌వారు కాంట్రాక్టు పద్ధతిలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ సరఫరా చేసే నీటికి సంబంధించిన పైపులు లీకేజీ అయ్యాయి. వారం రోజులుగా సంబంధిత పొలాల రైతులు, అధికారులకు సమాచారం ఇచ్చినా ఆలస్యం చేశారని వాపోయారు. అందులో భాగంగా స్థానిక రైతులకు పొలాల్లో నీరు చేరుతున్నాయని ప్రొద్దుటూరు తరలి వెళ్లే నీటిలో కలుషితం అవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా అగస్త్యేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సోమవారం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి వేద పండితులు పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగ, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి కల్యాణ వేదికపై ఆసీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల తో సుముహూర్తంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ఖాజీపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలని ప్రధానోపాధ్యాయుడు రవిబాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని అప్పనపల్లె పంచాయతీలో గల జిల్లా పరిషత్ హైస్కూలులో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు విజన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్వచ్చన్ బ్యాంకు పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు యల్లయ్య జూనియర్ అసిస్టెంట్ గంగాధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

కలసపాడు , జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :కలసపాడు మండలంలో యూరియా కొరత లేదని ఏవో షరీఫ్ తెలిపారు. మండలంలో రైతు సేవాకేంద్రాల్లో యూరియా తగినంత నిల్వలున్నాయని, రైతులు అపోహతో అనవసరంగా ఉన్నవాటి కంటే ఎక్కువ బస్తాలు కొనుగోలు చేసి ఇంట్లో నిల్వలు ఉంచుకుంటున్నారన్నారు. యూరియా అమ్మకం అయిపోయిన వెంటనే ఆర్డరు పెట్టి తెప్పించడం జరుగుతుందన్నారు. మండలంలో ఐదు రైతు సేవా కేంద్రాల్లో రోజుకు వంద టన్నుల యూరియా రావడం మరలా అమ్మకం జరుగుతుందన్నారు. రైతులు ఎవరూ కంగారు పడాల్సిన అవసరంలేదని, ఎప్పుడు కావాలన్నా రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

శాంతినగర్‌లో వెలగని వీధిదీపాలు

కొండాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని పలు వీధుల్లో వీధిదీపాలు వెలగడంలేదని స్థానికులు తెలిపారు. వీధిదీపాలు లేకపోవడంతో రాత్రిపూట ఇబ్బందిపడుతున్నామని వారు తెలిపారు. ముక్కుపిండి పంచాయతీలో పన్నులు వసూలు చేస్తున్నారని, కనీసం వీధిదీపాలు కూడా ఏర్పాటు చేయలేదని వారు మండిపడుతున్నారు. పలుమార్లు పంచాయితీ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. ఇటీవల కాలనీలో దొంగతనాలు జరుగుతున్నాయని, అయినా వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.